సాక్షి పెద్దపల్లి

బుధవారం : 24 : ఏప్రిల్ : 2024



ఉపాధ్యాయులకు సన్మానం

కమాన్‌పూర్: తొమ్మిది మంది ఐదో తరగతి విద్యార్థులు గురుకులంలో ప్రవేశాలు పొందడానికి కృషి చేసిన రాజాపూర్ పాఠశాల ఉపాధ్యాయులను పేరెంట్స్ సన్మానించారు.

అప్రమత్తంగా ఉండండి



సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. అనుమానం వచ్చిన ప్రతీవాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. మంగళవారం రాత్రి దుబ్బపల్లి చెక్‌పోస్టును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఉద్యోగులకు సూచించారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.5/28.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐదో రోజు 11 నామినేషన్లు

సాక్షి,పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం కోసం ఐదోరోజు మంగళవారం 11నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థిగా ఇరుకుల్ల రాజునర్సయ్య, యువతరం పార్టీ అభ్యర్థిగా చిలుక ఆనంద్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా(డెమొక్రటిక్) అభ్యర్థిగా మోతె నరేశ్(రెండో సెట్), అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) అభ్యర్థిగా ములకల కనకయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్(రెండో సెట్), తాళ్లపల్లి నరేశ్, రాచర్ల రాజేశం, ఇరికిల్ల రాజేశ్, కట్కూరి సందీప్(రెండో సెట్), సోల్లు రంజిత్ ఒక్కోసెట్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఇప్పటివరకు మొత్తం 33మంది అభ్యర్థులు 42 సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి దాఖలు చేశారు. బుధవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ ఆధ్వర్యంలో భారీర్యాలీతో తరలివెళ్లి నామినేషన్ వేస్తారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండలం ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్‌లోని ఉపాధిహామీ కూలీలను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మంగళవారం కలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ చేయి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పుష్కలంగా నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల మహేశ్, ఉరిమెట్ల రాజలింగం, గాదె సుధాకర్, బర్పటి తిరుపతి, మడ్డి తిరుపతిగౌడ్, గుంట బాపు ఉన్నారు.

పకడ్బందీగా తనిఖీ చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న అరుణశ్రీ

రామగుండం/పాలకుర్తి: చెక్‌పోస్టుల్లోని సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని ఎల్లంపల్లి, వేంనూర్ చెక్‌పోస్టులను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు 24 గంటలపాటు నడిచేలా చూడాలని, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నగదు జప్తు చేయాలని, రికార్డులో నమోదు చేయాలని సూచించారు. రెండు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలంలో ఏర్పాటు చేసిన బసంత్‌నగర్, పాలకుర్తి, కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మంగళవారం సందర్శించారు. రైతులు, నిర్వాహకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాలవర్షాలతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. కాగా, ఏ1–గ్రేడ్ కింద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రస్తుతం కామన్ గ్రేడ్‌గా పరిగణిస్తూ సేకరించడంతో తమకు ఆర్థికంగా నష్టం జరుగుతోందని రైతులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన.. ధాన్యం శాంపిళ్లు తీసుకుని గ్రేడ్ నిర్ధారణ చేయాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ భానుకుమార్, కన్నాల సింగిల్‌విండో సీఈవో సదయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

రామగిరి(మంథని): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. కల్వచర్లలో ఆమె మంగళవారం పర్యటించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతీఇంటికి వేసవి పూర్తయ్యే వరకూ తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. సరఫరాలో సమస్యలు తలెత్తితే ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీరు అందించాలన్నారు. డీఎల్‌పీవో శంకర్, ఎంపీవో ఉన్నారు.

రెండు ఎంపీ స్థానాలు ఐదు రోడ్‌షోలు..



- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పర్యటన
- ఐదు రోజుల పాటు యాత్ర
- రెండు పార్లమెంట్ సీట్లపై గురి
- శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

తెలంగాణ మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువైన పోరాటాల పురిటిగడ్డ కరీంనగర్ ఉమ్మడి జిల్లాపై గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్, పెద్దపల్లి స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఐదు రోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లో జరిగే రోడ్‌షోల్లో పాల్గొననున్నారు. కరీంనగర్, పెద్దపల్లి నియోజకవర్గాల్లో మరోసారి గులాబీ జెండా ఎగురవేసి కాంగ్రెస్, బీజేపీలకు ధీటైన సమాధానం చెప్పేందుకు పార్టీ అధిష్టానం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పార్టీ అధినేత ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలు ఎత్తిచూపేలా

కేంద్రంలోని బీజేపీతో రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదని, సాధారణ నిధులే తప్పా ప్రత్యేకమైన ప్యాకేజీలు, హోదాలు, పరిశ్రమలు, ప్రాజెక్టులు సాధించలేకపోయారని, రాష్ట్ర విభజన సందర్భంలో ఇచ్చిన హామీలే ఆటకెక్కించారని, ఉమ్మడి జిల్లాకు ఒక్క నవోదయ, మెడికల్ కళాశాల కూడా మంజూరు చేయించడంలో బీజేపీ ఘోరవైఫల్యం చెందిందనే విషయాన్ని ప్రజలకు రోడ్‌షోల్లో వివరించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు వినికిడి. కాంగ్రెస్ అడ్డగోలు అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను గందరగోళంలో పడేసి ఓట్లు దండుకుందని, నాలుగు నెలల్లో స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకే దిక్కులేకుండా పోయిందని ప్రజాక్షేత్రంలో ఎత్తిచూపేందుకు గులాబీ దళపతి సన్నద్ధమవుతున్నారు.

రెండు సీట్లపై గురి...

ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకొని పూర్వ వైభవాన్ని పొందాలని బీఆర్ఎస్ ఆశిస్తోంది. కరీంనగర్ మాజీ ఎంపీగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బోయినపల్లి వినోద్‌కుమార్ చేసిన ప్రజాసేవలను ప్రజలకు వివరించి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగేలా పార్టీ అధినేత కేసీఆర్ ద్వితీయ శ్రేణి నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. పెద్దపల్లి నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సింగరేణి కార్మికుడిగా, యూనియన్ నాయకుడిగా పనిచేయడమే కాకుండా గోదావరిఖని ప్రాంత వాస్తవ్యుడు కావడం విజయానికి సోపానం అవుతుందని పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకి టికెట్ ఖరారు కావడంతో నాలుగు దశాబ్దాలుగా ఒకే కుటుంబానికి చెందిన వారే ఎంపీలుగా ఉండటం , ప్రస్తుతం బెల్లంపల్లి, చెన్నూరులో ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం వివేక్, వినోద్ ఒకే కుటుంబానికి చెందిన వారేనన్న విషయాన్ని ఓటర్లకు విశదీకరించి ప్రచారాన్ని వేగం చేసేలా పార్టీ అధినేత క్యాడర్‌కు దిశానిర్దేశనం చేయనున్నట్లు సమాచారం.

కేసీఆర్ రోడ్ షోలు ఇలా...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేసీఆర్ బస్సు యాత్ర తేదీలు ఖరారయ్యాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర ఈనెల 24 నుంచి 17 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పాల్గొననున్నారు. ఈ యాత్ర ఐదు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో జరగనుంది.

- మే 2న జమ్మికుంట రోడ్‌షోలో ప్రసంగించి రాత్రి వీణవంకలో బసచేయనున్నారు.
- మే 3న రామగుండం రోడ్‌షోలో పాల్గొని రాత్రి అక్కడే బస చేస్తారు.
- మే 4న మంచిర్యాలలో జరిగే రోడ్‌షోలో ప్రసంగించి రాత్రి కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్‌లో బస చేయనున్నారు.
- మే 5న జగిత్యాల రోడ్‌షోలో పాల్గొని అక్కడ బస చేయన్నారు.
- మే 9 కరీంనగర్ జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించి రాత్రి బస చేయనున్నారు.
- మే 10న సిరిసిల్లలో జరిగే రోడ్‌షోలో పాల్గొని అక్కడి నుంచి సిద్దిపేట బహిరంగ సభలో పాల్గొని హైదరాబాద్ వెళ్లనున్నారు.

శ్రీఆంజనేయం



పూజల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ దంపతులు



హనుమాన్ ఆలయంలో స్వామివారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పెద్దపల్లిలోని హనుమాన్‌నగర్ శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అంజన్న చినజయంతి వైభవంగా నిర్వహించారు. శ్రీసీతారామలక్ష్మణుల బంటు అంజన్నను కొలుస్తూ తమ కుటుంబాలను చల్లంగా చూడాలని భక్తులు వేడుకున్నారు. అంజన్న భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



మైక్ ద్వారా చాటింపు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

‘ప్రజలారా.. ఎండకొడ్తంది.. బయటకు రావొద్దు’

‘ప్రజలారా.. ఎండలు దంచికొడుతున్నయ్.. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దు.. అస్వస్థతకు గురికావొద్దు.. తస్మాత్ జాగ్రత్త’ అని చిన్నకల్వల గ్రామపంచాయతీ సిబ్బంది మైతో వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరిగిందని, రోజువారీ అవసరాలు, పనులు ఉదయం, సాయంత్రం వేళల్లోనే పూర్తిచేసుకోవాలని చెబుతూ గ్రామంలో చాటింపు వేస్తున్నారు. మంగళవారం కనిపించిన ఈ దృశ్యాన్ని ‘సాక్షి’ ఇలా బంధించింది.
– సుల్తానాబాద్‌రూరల్

గిఫ్ట్‌గా బూడిద ‘కారు’

- ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల నేతలకు బహుమతి
- ఇందుకోసం ఒక్కో ఇటుక బట్టీ వ్యాపారి నుంచి రూ.50వేలు వసూలు?
- లావాదేవీలు చూసుకున్నందుకు ‘బూడిద పైసలతో’ ఓ నేతకు కారు బహుమతి
- పారిశ్రామిక ప్రాంతంలో చర్చనీయాంశం

సాక్షి, పెద్దపల్లి: ‘ఏం పెద్దాయనా.. పెద్దపల్లి పార్లమెంట్‌లో ఏం నడుస్తుంది? ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు’ అని ఎవరినైనా ప్రశ్నిస్తే.. అభ్యర్థుల ప్రచారం కన్నా.. గిఫ్ట్ కార్ల ముచ్చటే అధికంగా వినిపిస్తోంది. మొన్నటి వరకు ఎన్నికల్లో సహకరించేందుకు ఓ బడానేత కొందరు నేతలకు కార్లు బహుమతిగా ఇచ్చారని ప్రచారం జోరుగా వినిపించగా.. ఇప్పుడు ఓ నేతకు ‘బూడిద కారు’ గిఫ్ట్‌గా ఇచ్చారనే ముచ్చట అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తల్లో చక్కర్లు కొడుతోంది. పార్లమెంట్ ఎన్నికల వేళ.. పార్టీల ప్రచారం కంటే ‘గిఫ్ట్ కార్లు’ అంశమే చర్చనీయాంశంగా మారింది.

బూడిద వ్యాపారం నేపథ్యంలో..

రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించే బొగ్గు నుంచి వెలువడే నీటితో కూడిన బూడిదను చెరువులో నిల్వ చేస్తారు. అక్కడ నీటినుంచి వేరైనా బూడిదను ఇటుక బట్టీలు, ఇతర అవసరాలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బూడిద ధర కొంత తగ్గింది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పొరుగున ఉన్న మంచిర్యాలకు చెందిన ఇటుక బట్టీ నిర్వాహకులు ఇటుకల తయారీ కోసం బూడిద వినియోగిస్తున్నారు. గతంలో కొందరు నేతలు అక్రమ మార్గాల్లో ఇటుక బట్టీలకు బూడిద సరఫరా చేసి రూ.లక్షల్లో ఆర్జించారనే ఆరోపణలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ మారిన ఓ నేత, ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లోని ఇటుక బట్టీల వ్యాపారాన్ని బట్టి రూ.50 వేల చొప్పున సుమారు రూ.2కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు నాయకుడికి బూడిదకు సంబంధించిన లావాదేవీలు, వసూళ్లు చేసిపెట్టినందుకు ‘బూడిద పైసల’తో ఓ కారు కొనుగోలు చేసి ఓ నేత బహుమతిగా ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం ఇతర రాజకీయ పార్టీల నేతలకు తెలిసినా.. ‘బూడిద’పై మాట్లాడితే గతంలో చేసిన అక్రమాలు బయటకు వస్తాయని ఎవరూ నోరు విప్పడంలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

సెలవులు సద్వినియోగం చేసుకోండి

- జిల్లా విద్యాధికారి మాధవి



విద్యార్థులకు ప్రొగ్రెస్‌కార్డులు అందిస్తున్న మాధవి

ధర్మారం(ధర్మపురి): వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. సెలవుల సమయాన్ని టెలిఫోన్, టీవీల్లో కార్యక్రమాలు చూడకుండా మంచి పనులకు కేటాయించాలన్నారు. కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో పిల్లలు కథల పుస్తకాలు చదువుకుంటూ తల్లిదండ్రుల ద్వారా నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్, టీవీలను తక్కువగా చూస్తూ, శరీరానికి వ్యాయామం అందించే ఆటలపై దృష్టి సారించాలని డీఈవో అన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లరాదని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రొగ్రెస్ కార్డులను పరిశీలించి తల్లిదండ్రులతో పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు అందిస్తూ గుణాత్మక విద్య అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో ఉన్న అంతర్గత నైపుణ్యాలను పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల భారతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ రామడుగు భాగ్యలక్ష్మి, మహమ్మద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ ఆరోగ్య సర్వే



కల్వచర్లలో సర్వే చేస్తున్న అధికారులు

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామంలో మంగళవారం జాతీయ ఆరోగ్య బృందం సర్వే నిర్వహించారు. మూడురోజుల పాటు గ్రామాల్లో సర్వే నిర్వహించి ఎంపికైనా ఇరవై రెండు కుటుంబాలకు చెందిన సభ్యుల స్థితిగతులు, ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక విధానాలపై నివేదిక తయారు చేస్తారు. దీనిని ప్రభుత్వానికి అందించనున్నారు. దీని ఆధారంగా ఎంపికైన కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ, హెల్త్ సూపర్‌వైజర్ పి.కళావతి, ఏఎన్‌ఎం తార, ఆశ వర్కర్లు రాజ్యలక్ష్మి, విజయ, స్వప్న పాల్గొన్నారు.

సర్వేపై అయోమయం

ఆరోగ్య సర్వేపై ప్రజల్లో అయోమయం నెలకొంది. సర్వే చేయడంపై ఇరుగుపొరుగువారు ఆందోళన, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా రావడంపై అనుమానిస్తున్నారు.

సింగరేణి ఆస్తులు కాపాడాలి

- కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు



మాట్లాడుతున్న జీఎం దీక్షితులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆస్తులు పరిరక్షించాలని కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు సూచించారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం రక్షణ చర్యలపై సమీక్షించారు. సంస్థ భూములు, ఆస్తులు, క్వార్టర్లు ఆక్రమిస్తే చేపట్టాల్సిన చట్టబద్ధమైన చర్యల గురించి చర్చించారు. సంస్థ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లోని ఎంటీఎఫ్, ఏసీటీఎస్, ఇంటలిజెన్స్ విభాగాల పనితీరుపై ఆరా తీశారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల పనితీరు తదితర అంశాల గురించి సమీక్షించారు. ఆస్తులను కాపాడటంలో సెక్యూరిటీ విభాగం కీలక పోషించాలని పేర్కొన్నారు. సెక్యూరిటీ విభాగంలో రానున్న రోజుల్లో చేపట్టాల్సిన ప్రణాళికల గురించి చర్చించారు. సమావేశంలో సెక్యూరిటీ ఎస్‌వోటూ జీఎం వేణుమాధవ్, ఏరియా సెక్యూరిటీ అధికారులు వీరారెడ్డి, షరీఫ్, లక్ష్మీనారాయణ, మురళీమోహన్, ఎస్.రవి, వరప్రసాద్, రవి, అంజిరెడ్డి, జాకీర్ హుస్సేన్, శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా.. పర్యవేక్షణ లోపమా?

- నాణ్యతపై అనుమానాలు.. పనుల్లో జాప్యంపైనా సందేహాలు
- కుప్పకూలిన ఓడేడ్ – గర్మిళ్లపల్లి మధ్య మానేరు వంతెన గడ్డర్లు
- బలమైన గాలులకు అర్ధరాత్రి కూలడంతో తప్పిన పెను ప్రమాదం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్ అండ్ బీ ఎస్ఈ చందర్‌సింగ్

ముత్తారం(మంథని): ఓడేడ్ – గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై చేపట్టిన వంతెన పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడం, నిర్మాణంలో ఉన్న గడ్డర్లు గాలి దుమారానికే కుప్పకూలడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సోమవారం అర్ధరాత్రి వీచిన బలమైన గాలుల తర్వాత.. మంగళవారం ఉదయం మానేరులోకి వెళ్లిన స్థానికులు, రైతులకు విరిగిపడిన మూడు గడ్డర్లు కనిపించాయి. ఇవి ఈదురుగాలుల ధాటికి కూలి ఉంటాయని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు.



మానేరులో కుప్పకూలిన వంతెన గడ్డర్లు



సిమెంట్ దిమ్మెలకు బదులు పిల్లర్లపై పెట్టిన చెక్కలు

2016లో పనులు ప్రారంభం

- ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు 2016 ఆగస్టు 4న పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఓడేడ్ – ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై వంతెన నిర్మాణం ప్రారంభించారు.
- రూ.47.4కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వంతెన పనులను అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంథని ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రారంభించారు.
- మొత్తం 40మీటర్ల పొడవున 24 పిల్లర్లతో వంతెన నిర్మిస్తున్నారు.
- హైదరాబాద్‌కు చెందిన సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్ దక్కించుకుంది.
- నిర్దేశిత గడువులోగా పనిపూర్తి చేయకపోవడంతో 2020లో కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం టర్మినేషన్ చేసింది.
- అయితే, 2023లో మళ్లీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్.. మార్చి 2023 వరకు వంతెన నిర్మాణం పూర్తిచేయాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు.
- గడువు ముగిసి ఏడాది పూర్తయినా పనులు పూర్తికాలేదు.
- ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం పూర్తికాగా వాటిపై గడ్డర్లు బిగించారు.
- వీటిని బిగించి సుమారు మూడున్నరేళ్లవుతోంది.
- ఇప్పటికీ వంతెన నిర్మాణం పూర్తికాలేదు.
- ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి బలమైన గాలులు వీచాయి.
- దీంతో రెండు, మూడో పిల్లర్లపై బిగించిన మూడు గడ్డర్లు ఒక్కసారిగా కుప్పకూలి విరిగిపోయాయి.
- అయితే, పిల్లర్లపై సిమెంట్ దిమ్మె నిర్మించి గడ్డర్లు బిగించాల్సి ఉండగా, కర్రచెక్కలు పెట్టి బిగించడం, అవి వర్షానికి నాని పక్కకు జరిగి గడ్డర్లు కూలిపోయి ఉంటాయని పలువురు అభిప్రాపడుతున్నారు.
- ఇందుకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని ఆరోపిస్తున్నారు. ఈ కాంట్రాక్టరే వేములవాడ మూలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టారని, అది కూడా ఇలాగే గతంలో కుప్పకూలిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.
- కాగా, సంఘటన స్థలాన్ని ఆర్ అండ్ బీ జగిత్యాల ఎస్ఈ చందర్‌సింగ్, ఈఈ రాములు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, ఎస్సై మధూసూదన్‌రావు మంగళవారం పరిశీలించారు.
- ఎస్ఈ మాట్లాడుతూ గాలిదుమారంతో వంతెనలు కూలవన్నారు.
- గడ్డర్లు కూలడానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆయన వివరించారు.
- పిల్లర్లపై పెట్టిన కర్రలు వర్షపునీటికి నాని పక్కకు జరగడంతో గడ్డర్లు కూలాయని చెప్పారు.
- కూలిన మూడింటి స్థానంలో కొత్తవి నిర్మించాలని, కూలేస్థితిలో ఉన్న మరోరెండు గడ్డర్లను సరి చేయాలని స్థానికంగా ఉన్న అధికారులను ఆదేశించామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం మాజీ మేయర్ జాలి రాజమణి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాజమణికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్పొరేటర్ దుబాసి లలితతోపాటు మరో వందమంది మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో నాలుగు పథకాలు అమలయ్యాయన్నారు. ఎన్నికల తర్వాత మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. మే13న జరగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేశ్, యుగేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీపీసీ ప్రాజెక్టులోని కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బాలు నాయక్ ద్విచక్ర వాహనంపై ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు దాటుతున్న క్రమంలో అదేమార్గం నుంచి వచ్చిన టాటా మేజిక్ వాహనం ఢీకొంది. తలకు గాయాలు కావడంతో వెంటనే ట్రాఫిక్ కానిస్టేబుల్ సోము కుమార్ ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సీటీస్కాన్ నిమిత్తం గోదావరిఖనికి పంపించారు. బాలు నాయక్ తలకు హెల్మెట్ ఉండడంతో ప్రాణాపాయం తప్పింది.

గంజాయి విక్రేత అరెస్ట్

పెద్దపల్లిరూరల్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న షేక్ ఆసిఫ్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. ఇటీవల రైల్వేస్టేషన్ ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న ఘటనలో నమోదైన కేసులో ఆసిఫ్‌ను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న కారు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని రాజీవ్ రహదారిపై సోమవారం రాత్రి వ్యాన్‌ను కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ కమలాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు ధ్వంసమైంది. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న వ్యాన్‌ను కారు వెనుకనుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

కూలీ కుటుంబాన్ని ఆదుకుంటాం

మంథని: విలోచవరం గ్రామ శివారులోని ఊరచెరువులో ఉపాధిహామీ పనులు చేస్తూ ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందిన అక్కపాక లక్ష్మి కుటుంబాన్ని ఆదు కుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. లక్ష్మి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉపాధిహామీ చట్టం ద్వారా వచ్చే పరిహారంతో పాటు ఆ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. పనిప్రదేశంలో కూలీలకు అసౌకర్యం కలుగకుండా, ఎండ బారినపడి అస్వస్థకు గురికాకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సరదా చేష్టలు | జీవితాలు తలకిందులు



- వారం క్రితం కోరుట్ల అమ్మాయికి, కరీంనగర్ అబ్బాయితో పెళ్లి కుదిరింది. శుభలేఖల పంపిణీ, పెళ్లి పనుల అడ్వాన్స్ చెల్లింపులు పూర్తయ్యాయి. రెండు రోజుల్లో వివాహం.. ఇంతలో కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడు పెళ్లి కూతురు ఇంటికి వెళ్లి, తాను ఆమెను ప్రేమించానని తన కిచ్చి పెళ్లి చేయాలని గొడవ చేశాడు. పెళ్లి కూతురు, తల్లిదండ్రులు నిరాకరించడంతో పెళ్లి కొడుకు వద్దకు వెళ్లి ఆ యువతితో ఉన్న ఫొటోలు చూపించి, బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో అతను పెళ్లి రద్దు చేసుకున్నాడు.
- 'ఈ నెల 26న పెళ్లి.. 3 రోజుల ముందు పెళ్లి కొడుకు అన్నకు దుబాయ్ నుంచి ఓ బెదిరింపు కాల్ వచ్చింది. పెళ్లి కూతురు, తాను ప్రేమించుకున్నామని ఓ వాయిస్ రికార్డు పంపించాడు. దుబాయ్ నుంచి వచ్చాక తానే ఆమెను పెళ్లి చేసుకుంటానన్నాడు. అంతే.. పెళ్లి కొడుకు తరఫువారు పెళ్లి రద్దు చేసుకున్నారు. అమ్మాయి బంధువులు కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. పెళ్లి కొడుకు మెట్‌పల్లి మండలవాసి కాగా, పెళ్లి కూతురు కోరుట్ల మండల యువతి. వాయిస్ రికార్డుతో పెళ్లి చెడగొట్టిన యువకుడు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లివాసి అని తెలిసింది.

- చదువుకున్న రోజులనాటి ఫొటోలు, వీడియోలు, చాటింగే కారణం
- వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేస్తున్న పలువురు యువకులు
- జగిత్యాల జిల్లాలో పదుల సంఖ్యలో రద్దవుతున్న పెళ్లిళ్లు
- యువతుల పరిస్థితి అగమ్యగోచరం
- టీనేజర్లూ.. జర జాగ్రత్త

- 'కోరుట్లకు చెందిన ఓ అమ్మాయి కళాశాల చదువు సమయంలో ఓ ఫంక్షన్‌లో తనతో దిగిన ఫొటోలను మార్ఫింగ్ చేశాడు కోరుట్లకు చెందిన యువకుడు. వాటిని చూపించి, నెల రోజుల క్రితం ఆమెను బ్లాక్‌మెయిల్ చేశాడు. అప్పటికే ఆమెకు వివాహం నిశ్చయమైంది. పెళ్లి కొడుకు బంధువులకు మార్ఫింగ్ ఫొటోలు పంపించాడు. ఇంతలో పెళ్లి కూతురు బంధువులు పోలీసులను ఆశ్రయించారు. వారు ఆ యువకుడిని పట్టుకొని ఫోన్, ల్యాప్‌టాప్ నుంచి ఫొటోలు డిలీట్ చేయించారు. దీంతో పెళ్లి కాన్సిల్ అయ్యే పరిస్థితుల నుంచి బయటపడ్డారు.' ఇలా ఒకటి, రెండు కాదు.. చదువుకునేటపుడు సరదాగా దిగిన ఫొటోలు చివరికి వివాహాల రద్దుకు దారితీస్తున్నాయి. పెళ్లి పీటలెక్కనున్న యువతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారడమే కాదు.. వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనతో ఇంట్లో నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంటోంది.



కోరుట్ల: బర్త్ డే, ఫ్రెండ్‌షిప్‌డే, వాలంటైన్స్ డే, ఫ్రెషర్స్ డే.. ఏదైతేనేమీ.. చదువుకునే రోజుల్లో స్నేహం పేరిట కొంతమంది అమ్మాయిలు, అబ్బాయిలు హోటళ్లు, రెస్టారెంట్లు, పార్కులు, పిక్నిక్ టూర్ స్పాట్లలో కలుపుగోలుగా ఉన్నప్పుడు సరదా కోసం తీసుకుంటున్న సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు, వాట్సాప్ చాటింగ్‌లు, వాయిస్ రికార్డులు కొన్ని సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నాయి. స్నేహాన్ని తర్వాత ప్రేమ అనుకునే కొందరు యువకులు, అసరాల కోసం మరికొందరు ఆ ఫొటోలు, వీడియోలతో బెదిరింపులకు దిగుతున్నారు. తమకు దక్కని అమ్మాయి ఎవరికీ దక్కొద్దని పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నారు. ఈ పరిస్థితులు చదువుకునే రోజుల్లో టీనేజర్లూ.. జర జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాయి.

గొడవలు, కేసుల్లో ఇరుక్కుంటూ..

ఈ ఏడాది పెళ్లిళ్ల సీజన్ మొదలై, సుమారు మూడు నెలలు కావస్తోంది. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల పరిసరాల్లో పదుల సంఖ్యలో పెళ్లిళ్లు చివరి సమయంలో రద్దవుతుండటం గమనార్హం. పెళ్లి పీటల మీద కూర్చోవాల్సిన జంటలు గొడవలు, కేసుల్లో ఇరుక్కొని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ నరకయాతన పడుతున్నారు. అమ్మాయిల పెళ్లిళ్లు ఆగిపోయిన పలువురు తల్లిదండ్రులు పరువు పోయిందని ఆవేదన చెందుతున్నారు.

పిల్లలకు మార్గనిర్దేశం చేయాలి



టీనేజీలో హార్మోన్ల మార్పులతో నెలకొనే శారీరక, మానసిక సంఘర్షణను తట్టుకునేలా తల్లిదండ్రులు వారి అమ్మాయిలు, అబ్బాయిలకు సరైన మార్గనిర్దేశం చేయాలి. ప్రేమ, వ్యామోహం, ఆకర్షణకు తేడాపై అవగాహన లేని వయసులో జరిగే పొరపాట్లు ఒక్కోసారి జీవితాలను ముంచేస్తాయి.

– డాక్టర్ స్వాతి అనూప్‌రావు, గైనికాలజిస్టు, కోరుట్ల

అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి



ఫ్రెండ్స్, క్లాస్‌మేట్స్, బంధువుల అబ్బాయిలతో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి. సరదాగా, కలివిడిగా ఫొటోలు, వీడియోలు తీసుకోవడం, వాట్సాప్ చాటింగ్ చేయడం ప్రమాదకరం. ఇద్దరి మధ్య స్నేహం చెడిన సందర్భాల్లో అవి దుర్వినియోగమై, బ్లాక్‌మెయిల్‌కు వాడుతున్నారు.

– వాసం భూమానందం, కౌన్సెలింగ్ గైడ్, కోరుట్ల

కఠినచర్యలు తీసుకుంటాం



మార్ఫింగ్ ఫొటోలు, సరదాగా తీసుకున్న వీడియోలు మిక్స్ చేసి, వాట్సాప్ చాటింగ్‌లతో అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసేవారిపై కఠినచర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులకు ఈ విషయంలో ఎలాంటి భయం వద్దు. ధైర్యంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి, ఇబ్బంది కలగకుండా చూస్తాం.

– ఉమామహేశ్వర్‌రావు, డీఎస్పీ, మెట్‌పల్లి

పూర్వవైభవం కోసం టీబీజీకేఎస్ ఆరాటం

- నేడు 'ఖని'లో రాష్ట్ర ప్రతినిధుల సభ
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కీలకనిర్ణయాలు తీసుకునే అవకాశం

గోదావరిఖని: సింగరేణిలో పూర్వవైభవం సాధించేందుకు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీబీజీకేఎస్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. పదేళ్లపాటు సింగరేణిలో గుర్తింపు యూనియన్‌గా ఏకఛత్రాధిపత్యం సాధించిన టీబీజీకేఎస్ ఎన్నికలకు దూరంగా ఉండాలనే నిర్ణయం నాయకులను కుదిపివేసింది. ముఖ్య నాయకులు బి.వెంకట్రావ్, కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజిరెడ్డిని యూనియన్‌కు రాజీనామా చేయాలని కేసీఆర్ ఆదేశించారు. దీంతో రెండు దశాబ్దాల చరిత్ర ఉన్న టీబీజీకేఎస్ ఒక్కసారిగా పెద్దకుదుపునకు లోనైంది.

జయశంకర్ చేతుల మీదుగా పురుడు ..

2003 జనవరి 27న ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేతుల మీదుగా యూనియన్ పురుడు పోసుకుంది. అదేఏడాదిలో జరిగిన సింగరేణి గుర్తింపు కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఆర్జీ–2 ఏరియాలో ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందింది. 2007లో జరిగిన ఎన్నికల్లో ఆర్జీ–2, ఆర్జీ–3 ఏరియాలతో పాటు మందమర్రి డివిజన్‌లో ప్రాతినిధ్యంగా గెలుపొంది సత్తా చాటింది. 2012, 2017లో జరిగిన ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా గెలుపొంది సింగరేణిలో తన సత్తా చాటింది.


మాట్లాడుతున్న నాయకులు

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ..

- కారుణ్య నియామకాల ద్వారా వారసత్వ ఉద్యోగాలు
- కార్మికుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా ఉచిత కార్పొరేట్ వైద్యం
- మహిళా ఉద్యోగులకు ఆరు నెలల ప్రసూతి సెలవులు, రెండేళ్ల చైల్డ్ కేర్ లీవులు
- కార్మికులకు ఉచిత విద్యుత్‌తోపాటు ఏసీ సౌకర్యం కల్పన
- ఐఐటీ, ఐఐఎంల్లో చదివే కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్
- సొంతింటి కోసం రూ.10లక్షలు వడ్డీలేని రుణం
- అంబేడ్కర్ జయంతి, క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి సెలవు దినాలు ప్రకటించి పీహెచ్‌డీ ఆర్థిక ప్రయోజనం కల్పించారు.
- సత్తుపల్లి, భూపాలపల్లి ఏరియాలో డబుల్ బెడ్ రూమ్ క్వార్టర్ల నిర్మాణం పూర్తి
- డిస్మిస్ అయిన కార్మికులకు మూడు దఫాలుగా ఉద్యోగ అవకాశాలు
- సింగరేణి వ్యాప్తంగా ఏసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
- కార్మికులకు డ్రెస్ కోడ్ ఉండాలని ఉచితంగా యూనిఫామ్ అందజేత
- స్పోర్ట్స్, పీఎంఈ వైద్య పరీక్షలకు వెళ్లే కార్మికులకు ఆన్‌డ్యూటీ మస్టర్
- కార్మికుడి కూతురు రెండో డెలివరీ కూడా సంస్థ ఆస్పత్రిలో ఉచితం

నేడు ప్రతినిధుల సభ

బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగే యూనియన్ రాష్ట్ర ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ పోరాటం చేస్తోందన్నారు. సమావేశంలో ఆరుజిల్లాల్లోని 11ఏరియాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారని అన్నారు. రాజకీయ పరిస్థితులు, యూనియన్ వార్షిక నివేదికపై తీర్మానం చేస్తామని అన్నారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, చల్ల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


రోదిస్తున్న కుటుంబసభ్యులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్యాల గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గయ్యపల్లె గ్రామానికి చెందిన ఉప్పుల దేవేందర్(33) పనికోసం బైక్‌పై కాల్వశ్రీరాంపూర్ వచ్చి తిరుగు ప్రయాణంలో పెట్రోల్‌పంపు సమీపంలో అదుపుతప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. ఈఘటనలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రిసమయం కావడంతో ఎవరూచూడలేదు. మంగళవారం తెల్లవారుజామున వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి అమ్మ తమ్మ చిన్నప్పుడే చనిపోగా తండ్రి రామయ్య పెంచి పెద్దచేశాడు. భార్య జ్యోతి, కుమారుడు యశ్వంత్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసన మోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.


దేవేందర్(ఫైల్)

కన్నాల అడవిలో మృతదేహం లభ్యం

పాలకుర్తి(రామగుండం): కన్నాల గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అటవీప్రాంతంలో చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వేలాడుతుండడాన్ని ఉపాధిహామీ కూలీలు గుర్తించి పంచాయతీ కార్యదర్శి ఆశాడపు శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. కార్యదర్శి ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై స్వామి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి ఖననం చేశారు. మృతుడి వయస్సు దాదాపు 50 – 60ఏళ్ల మధ్య ఉంటుందని, చనిపోయి దాదాపు 15రోజులు గడిచి ఉంటుంని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఎవరు, మృతికి గల కారణాలపై విచారణ జరుగుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

బిలోలి కోర్టుకు హాజరైన తెలంగాణ ఎమ్మెల్యేలు

- ఏళ్ల తరబడి సాగుతున్న బాబ్లీ కేసు విచారణ

కరీంనగర్/పెద్దపల్లిరూరల్: తెలంగాణ రైతుల కోసం నీటికోసం పోరాటంలో భాగంగా 2010లో మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన కేసులో రాష్ట్ర ఎమ్మెల్యేలు కోర్టుకు హాజరయ్యారు. బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బిలోలి సెషన్ కోర్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్ , విజయ రమణరావు, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతు షిండే, కె.ఎస్.రత్నం హాజరయ్యారు. మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మించి నీళ్లు రాకుండా అడ్డుకోవడంతో 2010లో అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో భారీ ఆందోళనకు దిగారు. బాబ్లీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే వరకు కదలమని భీష్మించడంతో మహారాష్ట్ర పోలీసులు– టీడీపీ నాయకులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో మరాఠీ పోలీసులు లాఠీచార్జీ చేయడమే కాకుండా చంద్రబాబుతో సహ తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులపై కేసులు నమోదు చేశారు. ఆ కేసుల విచారణలో భాగంగా మహారాష్ట్రలోని బిలోలి కోర్టుకు హాజరై తమ వాదన వినిపించారు.


కోర్టు ప్రాంగణంలో ఎమ్మెల్యేలు

అంతా టీడీపీలో.. నేడు వేర్వేరు పార్టీల్లో

బాబ్లీకి వ్యతిరేకంగా నాడు చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. ఆనాటి పోరాటంలో ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా విజయరమణారావు, నాయకులుగా ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. ప్రస్తుతం గంగుల కమలాకర్ బీఆర్ఎస్‌లో ఉండగా విజయరమణరావు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

దంపతుల్లో చిచ్చురేపిన అప్పు

- పురుగులమందు తాగిన భార్యాభర్తలు
- చికిత్స పొందుతూ భర్త మృతి


మధుసూదన్(ఫైల్)

ముత్తారం(మంథని): దంపతుల మధ్య అప్పు చిచ్చు రేపింది. అప్పు తీర్చే దారిలేక ఇద్దరూ గొడవపడి పురుగులమందు తాగారు. చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్య ప్రాణాలతో బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం.. ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పూసాల మధూసూదన్ – సంధ్య దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమకు ఉన్న నాలుగు ఎకరాల్లో పంటల కోసం బోరు వేశారు. ఇందుకోసం రూ.రెండు లక్షలు అప్పు తెచ్చారు. కూతురు వివాహం కోసం మరో రూ.5లక్షలు, పాత బాకీ రూ.5లక్షలు ఉన్నాయి. ఈసారి పండించిన పంట చేతికి వచ్చేలా లేదని, అప్పు ఎలా తీర్చాలని దంపతులు మనోవేదనకు గురయ్యారు. ఈక్రమంలో ఇద్దరూ గొడువపడ్డారు. ఈనెల 12న ఇద్దరూ పురుగులమందు తాగారు. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈనెల 14న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. భార్య సంధ్య కోలుకుని ఈనెల 18న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి చేరుకుంది. మధూసూదన్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఆకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తుల బదిలీ

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ, వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అరుణ సిటీ సివిల్ కోర్టు సికింద్రాబాద్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖను నియమించారు. హైదరాబాద్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రాధిక జైస్వాల్‌ను సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించగా, వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్‌ను మేడ్చల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి అర్జున్‌ను మేడ్చల్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు జడ్జి స్వప్న రాణి నియమితులయ్యారు. గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి రాజ్‌కుమార్‌ను సికింద్రాబాద్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో హన్మకొండ సీని యర్ సివిల్ జడ్జి బ్యంగి శ్రీనివాసులును నియమించారు. మంథని జీడ్జి భారతిని చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

స్థానికేతరుల కోట!

- స్థానికేతరుల అడ్డాగా 'పెద్దపల్లి'

సంవత్సరం	గెలిచింది	స్వస్థలం
1962	ఎంఆర్ కృష్ణ	కర్నాటక
1967	ఎంఆర్ కృష్ణ	కర్నాటక
1971	వి.తులసీరామ్	హైదరాబాద్
1977	వి.తులసీరామ్	హైదరాబాద్
1980	కోదాటి రాజమల్లు	రేగడిమద్దికుంట
1984	గొట్టె భూపతి	తంగళ్లపల్లి(సిరిసిల్ల)
1989	గడ్డం వెంకటస్వామి	హైదరాబాద్
1991	గడ్డం వెంకటస్వామి	హైదరాబాద్
1996	గడ్డం వెంకటస్వామి	హైదరాబాద్
1998	సీహెచ్ సుగుణకుమారి	హైదరాబాద్
1999	సీహెచ్ సుగుణకుమారి	హైదరాబాద్
2004	గడ్డం వెంకటస్వామి	హైదరాబాద్
2009	గడ్డం వివేకానంద	హైదరాబాద్
2014	బాల్క సుమన్	మెట్‌పల్లి
2019	బొర్లకుంట వెంకటేశ్ నేత	తిమ్మాపూర్(జన్నారం)

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం స్థానికేతరులకు కంచుకోటగా నిలుస్తూ వస్తోంది. ఇక్కడ అత్యధికంగా స్థానికేతరులనే విజయం వరించింది. ఇప్పటివరకు ఎన్నికైన వారిలో కోదాడి రాజమల్లు మాత్రమే స్థానికుడు కావడం గమనార్హం. మిగతా వారిలో ఈ లోక్‌సభ పరిధిలోని వారెవరూ లేరు. లోక్‌సభ ఫలితాల చరిత్ర పరిశీలిస్తే.. ఇక్కడి ఓటర్లు ఎక్కువగా ఇతర ప్రాంతాల వారినే గెలిపిస్తున్నారు. ఈ పార్లమెంటు పరిధిలోని ఏదోఒక అనుబంధంతో స్వస్థలం ఈ ప్రాంతం కానప్పటికీ రాజకీయాల్లో రాణిస్తున్నారు. 1962లో నియోజకవర్గం ఏర్పాటు నుంచి నేటివరకు పెద్దపల్లి పరిధిలో ఒకేఒక్కసారి స్థానిక అభ్యర్థి గెలుపొందారు. కోదాటి రాజమల్లు మాత్రమే ఈ లోక్‌సభ పరిధిలోని వారు. ఆయన ప్రస్తుత పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటకు చెందినవారు. ఎంఆర్ కృష్ణ కర్నాటక ప్రాంతానికి చెందిన వారైనప్పటికీ రెండుసార్లు గెలుపొంది రికార్డు సృష్టించారు. తాజాగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పోటీ హోరాహోరీగా సాగుతుండగా ఈసారి ఎవరిని పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తారనేది ఆసక్తిగా మారింది.

ఈసారి ఎవరికో..

ఈసారి ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఇద్దరు ఇదే లోక్‌సభ పరిధిలోని వారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంట వాసికాగా, గోదావరిఖనిలో స్థిరపడ్డారు. బీజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ స్వస్థలం కాటారం మండలం జాదూరావుపేట కాగా, మంచిర్యాల పట్టణంలో స్థిరపడ్డారు. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న గడ్డం వంశీకృష్ణ స్వస్థలం హైదరాబాద్ కాగా, మంచిర్యాలలోనూ ఇల్లు ఉంది.

'బీఆర్ఎస్ అవినీతి పాలనకు నిదర్శనం'


వంతెన పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం(మంథని): బీఆర్ఎస్ పాలన అవినీతితోనే ఓడేడ్ మానేరు వంతెన కూలిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ విమర్శించారు. మానేరులో కూలిన వంతెన గడ్డర్లను మంగళవారం వారు పరిశీలించారు. బీఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే, కాంట్రాక్టర్ కుమ్మక్కై నాసిరకం పనులు చేయడంతోనే నిర్మాణదశలోనే వంతెన కూలిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనతోనే మంథని నియోజకవర్గంలో కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజీ, ముత్తారం మండలంలో ఓడేడ్ వంతెన కూలిందని ధ్వజమెత్తారు. వంతెన కూలడానికి గల కారుకులు ఎవరైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి కూలడానికి బాధ్యత వహిస్తూ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు తమ పదవికి రాజీనామ చేసి, ఈప్రాంత ప్రజలకు క్షేమపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, మాజీ సర్పంచ్ సిరికొండ బక్కారావు, నాయకులు దాసరి చంద్రమౌళి, తీగత సత్యనారాయణ, గాదం శ్రీనివాస్, సదానందం తదితరులు ఉన్నారు.

వంతెన వైపు ఎవరూ వెళ్లొద్దు


సూచనలు చేస్తున్న ఏసీపీ రమేశ్

ముత్తారం(మంథని): ఓడేడ్ మానేరులో కూలిన వంతెనను గోదావరిఖని ఏసీపీ రమేశ్ మంగళవారం పరిశీలించారు. వంతెన నిర్మాణంలోని మూడు గడ్డర్లు కూలడానికి గల కారణాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న మరో రెండు గడ్డర్లు, పిల్లర్ల వైపు ఎవరూ వెళ్లకూడదని స్థానికులకు సూచనలు చేశారు. వంతెన పిల్లర్ల కింద కూడా ఎవరూ కూర్చోవద్దని వివరించారు. ఆయన వెంట మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మధూసూదన్‌రావు ఉన్నారు.

మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు


పోస్టుకార్డులు చూపిస్తున్న మధు, నాయకులు

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టిందని, ఈవిషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓరుగంటి వెంకటరమణరావుతో కలిసి ఆయన పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల విధానం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. రైతులకు రూ.500 బోనస్, రూ.15వేల రైతుబంధు, రుణమాఫీ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాలో వేల ఎకరాల్లో రైతులు వరి పంట నష్టపోతే రాష్ట్రంలోనే కేవలం మూడు వేల ఎకరాల్లో నష్టం జరిగిందని అనడం బాధాకరమన్నారు. దేశంలో ఇప్పటివరకు దేవుళ్లపై ఒట్టు పెట్టి హామీలను అమలు చేస్తామని చెప్పిన సీఎంలు లేరని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే ఆ ఘనత దక్కిందని ఎద్దేవా చేశారు.

అంజన్న జయంతిలో అపశృతి

- ఆర్టీసీ బస్సు కింద పడి భక్తుడి మృతి
- మృతుడిది వరంగల్ జిల్లా నెక్కొండ మండలం


క్షతగాత్రుడిని వాహనంలో ఎక్కిస్తున్న ఎస్సై

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి చిన్న జయంతి ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. స్వామివారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ఆర్టీసీ బస్సు కింద పడి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన లక్ష్మణ్ (55) తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనానికి వచ్చారు. పార్కింగ్ స్థలం నుంచి గుట్టపై ఉన్న వైజంక్షన్ వరకు భక్తుల కోసం ఆలయం తరఫున బొజ్జ పోతన్న ఆలయ ప్రాంతంలో ఉచిత బస్సును అందుబాటులో ఉంచారు. లక్ష్మణ్ బస్సు ఎక్కే సమయంలో డ్రైవర్ బస్సును ముందుకు నడిపించాడు. దీంతో లక్ష్మణ్ బస్సు ముందుటైర్ల కింద పడ్డాడు. గమనించకుండానే డ్రైవర్ ముందుకు వెళ్లడంతో టైర్లు లక్ష్మణ్ కాళ్లపైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో లక్ష్మణ్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు, పోలీసులు అతడిని కరీంనగర్‌కు తరలిస్తుండగా.. మార్గంమధ్యలో మృతిచెందాడు.

కనిపించని మానవత్వం..

ప్రమాదం జరిగిన సమయంలో భక్తులతోపాటు పోలీసులు కూడా అక్కడే ఉన్నారు. అయితే 15 నిమిషాల వరకూ లక్ష్మణ్‌ను ఎవరూ పట్టించుకోలేదు. కూతవేటు దూరంలో ఉన్న అంబులెన్స్ సిబ్బంది కూడా రాకపోవడం విమర్శలకు తావిచ్చింది. చివరకు జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం ఎస్సై పవర్ గౌతం క్షతగాత్రుడిని తన చేతులతో ఎత్తుకుని.. భక్తుల వాహనంలో ఎక్కించారు. కొద్ది దూరం చేరుకున్నాక.. అంబులెన్స్ చేరుకుంది. క్షతగాత్రుడిని కరీంనగర్ జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.